సాక్షి నిజామాబాద్

గురువారం। 7। నవంబర్। 2024



సైబర్ నేరాల నివారణకు..

సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు అదనపు కమిషనర్ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

- 10లో ▸



రైతుల ధాన్యం రోడ్డు పాలు

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించే క్రమంలో లారీల్లో నుంచి కింద పడుతున్నాయి.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.5 /16.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



మాక్లూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులు, సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. మాక్లూర్ మండల కేంద్రంతో పాటు మాదాపూర్, కల్లెడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇష్టపూర్వకంగా తరలిస్తున్నారా లేదా బలవంతంగా తెప్పిస్తున్నారా అనేది ఆరాతీశారు. రైతులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీవో శ్రీనివాస్ రావు, తహసీల్దార్ శేఖర్, క్లస్టర్ అధికారి దీప, అధికారులు ఉన్నారు.

అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్: ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా సంస్థల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమన్నారు. డిసెంబర్ 10లోపు నామినేషన్లను ఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయానికి పోస్టులో పంపాలని సూచించారు. ఈ–మెయిల్ ద్వారా అయితే media&division@eci.gov.inకు పంపవచ్చన్నారు.

డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అశోక్



నిజామాబాద్ అర్బన్: జిల్లా డీఈవోగా అశోక్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. గత డీఈవో దుర్గాప్రసాద్ బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈవో అశోక్‌ను కలిసి అభినందనలు తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగెళ్ల సురేష్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కిషన్, అంకం నరేష్, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కృపాల్‌సింగ్ డీఈవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

నిజామాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా బుధవారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. మొదటి రోజు హౌస్ లిస్టింగ్ ప్రక్రియ చేపట్టారు. గురు, శుక్రవారాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసి ఈనెల 9 నుంచి సమగ్ర కుటుంబ వివరాలు నమోదు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, టీచర్లు సర్వేలో పాల్గొన్నారు. మండలాల ఇన్‌చార్జిలు, సూపర్‌వైజర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు.

ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ విద్యార్థులు వార్షిక పరీక్షల ఫీజును ఈ నెల 26లోపు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అపరాధ రుసుముతో డిసెంబర్ 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. ఒకేషనల్ విద్యార్థులు రూ.750, ఆర్ట్స్ కోర్సులకు రూ.520, సైన్స్ విద్యార్థులు రూ.750 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

నేడు జిల్లాకు ప్రత్యేకాధికారి

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర గిరిజన వెల్ఫేర్ సెక్రెటరీ, ధాన్యం కొనుగోళ్ల ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి శరత్ గురువారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు కామారెడ్డి జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఒంటి గంటకు నిజామాబాద్‌కు చేరుకుంటారు. ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

తెయూ అభివృద్ధి దిశగా..



యూనివర్సిటీలో ఎంఫార్మసీ, బీఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలల కోసం..

- ప్రతిపాదనలు పంపిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- ల్యాబ్‌లు, హాస్టల్స్, ఆడిటోరియం ఏర్పాటు చేయాలని వినతి
- ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ జిల్లాలను సైతం వర్సిటీలో కలపాలని సూచన

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి

తెలంగాణ విశ్వవిద్యాలయంలో కోర్సుల సంఖ్యను పెంచడంతో పాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అదేవిధంగా వర్సిటీలో విద్యాప్రమాణాలను మరింతగా పెంచే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. వర్సిటీ పరిధిని పెంచేందుకు చుట్టుపక్కల ఉన్న మూడు జిల్లాలను కలిపేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఈ విషయాలన్నింటిపై ప్రతిపాదనలు పంపడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించాను. వర్సిటీ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

– భూపతిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో మరిన్ని కోర్సులు ఏర్పాటు చేసేందుకు, సౌకర్యాలు మెరుగు పరిచేందుకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా వర్సిటీ పరిధిని సైతం విస్తరించాలని అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం ఎమ్మెల్యే చేశారు. తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యే, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ కళాశాలలను సైతం యూనివర్శిటీలో ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే పాలమూరు వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల, కొడంగల్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇదేవిధంగా నిజామాబాద్‌లోని పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా, తెలంగాణ వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే తెలంగాణ యూనివర్శిటీలో ఇంజినీరింగ్ కళాశాలతో పాటు బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా సెల్ఫ్ మేనేజ్‌మెంట్ కోర్సులకు సైతం అవకాశం కల్పించాలని ప్రతిపాదనలు పంపారు. నిజామాబాద్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉన్న నేపథ్యంలో వర్సిటీలో ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. టీయూలో మరిన్ని ల్యాబ్‌లు, వసతి గృహాల భవనాలు, ఆడిటోరియం నిర్మించాలని కోరారు..

పరిధి పెంచాలని..

వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని కాలేజీలను, ఉస్మానియ యూనివర్సిటీ పరిధిలో ఉన్న మెదక్ జిల్లాల్లోని కళాశాలలను సైతం తెలంగాణ యూనివర్శిటీకి అనుబంధంగా మార్చాలని ఎమ్మెల్యే ప్రతిపాదనలు చేశారు. జిల్లాకు అనుకుని 50 నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లాలను కాకతీయ వర్సిటీకి అనుబంధంగా కొనసాగిస్తుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రతిపాదనల్లో ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలన్నింటికి సంబంధించి వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఆమోద ముద్ర వేయించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఉన్నారు.

ఇంటింటి సర్వేకు సహకరించాలి



సీతాయిపేట్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ధర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలన్నారు. ధర్పల్లి మండలంలోని సీతాయిపేట్‌లో నిర్వహిస్తున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే కోసం అతికించిన స్టిక్కర్లను వాటిపై నమోదు చేసిన ఇంటి నంబర్, ఎన్యూమరేషన్ బ్లాక్ తదితర వివరాలను తనిఖీ చేశారు. తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటింటి సర్వే కోసం 3,245 ఎన్యుమరేటర్లను నియమించామని తెలిపారు. సర్వేలో భాగంగా ఈ నెల 8వ తేది వరకు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, 9వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందని వివరించారు.

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ

జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. సీతాయిపేట్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత రైస్‌మిల్లులకు పంపించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో బాలకృష్ణ ఉన్నారు.

ఆవిష్కరణల్లో స్టాటిస్టిక్స్ పాత్ర కీలకం

తెయూ(డిచ్‌పల్లి): నూతన ఆవిష్కరణల్లో సాంఖ్యాక శాస్త్రం(స్టాటిస్టిక్స్) పాత్ర కీలకమని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటి స్టిక్స్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(టీజీసీవోఎస్‌టీ) సంయుక్తంగా బుధవారం యూనివర్శిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. గణాంకశాస్త్ర భావనలు ప్రధానంగా శాస్త్ర సాంకేతిక ప్రసార రంగాన్ని బలోపేతం చేసి సమాజ పురోభివృద్ధికి దారి చూపాయన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ పరిశోధనలు, సాంఖ్యాక శాస్త్రం ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమంలో టీజీసీవోఎస్‌టీ వర్సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్, అప్లైడ్ స్టాటిస్టిక్స్ హెచ్‌వోడీ సంపత్ కుమార్, సైన్స్ డీన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, అధ్యాపకులు పురుషోత్తం, రాజేశ్వర్, నర్సింలు, సందీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు

ఇందూరు నుంచి కాశీ దాకా సేవల విస్తరణ

- కాశీలో స్వర్గ రథాన్ని ప్రారంభించిన మంచాల చారిటబుల్ ట్రస్ట్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్న మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ తన సేవలను కాశీ వరకు విస్తరించింది. బుధవారం కాశీలో ఈ ట్రస్టు ఆధ్వర్యంలో స్వర్గ రథాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంచాల జ్ఞానేందర్ గుప్తా స్వర్గ రథాన్ని ఉత్తరప్రదేశ్ ప్రత్యేక పోలీస్ అధికారి నిధిదేవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం జ్ఞానేందర్ మాట్లాడుతూ.. తన తండ్రి పేరిట ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. తెలంగాణలోని నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కనగర్తిలో ఉచిత స్వర్గ రథాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదే విధంగా అంతిమయాత్ర రోజున 50 మందికి ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. ప్రతి హిందువు ఇంట్లో భగవద్గీత ఉండాలనే సంకల్పంతో ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో తాను కాశీకి వచ్చినప్పుడు ఇక్కడ స్వర్గ రథాలు లేకపోవడాన్ని గమనించానన్నారు. కాశీ మోక్షధామ్ ఆధ్వర్యంలో నడిపించేందుకు స్వర్గ రథాన్ని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మంచాల శ్రీలక్ష్మి, పవన్, కేశవులు, బెజవాడ ఆగమయ్య, వేదవతి, కేశవ్, జగన్ పాల్గొన్నారు.



కాశీలో స్వర్గరథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పెరిగిన ‘డైట్’ చార్జీలు



రెంజల్ మైనారిటీ గురుకుల పాఠశాలలో కొత్త చార్జీల వివరాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- ఈ నెల 10 నుంచి కొత్త చార్జీల అమలు
- నూతన మెనూ అమలుకు అధికారుల ఏర్పాట్లు

రెంజల్: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చార్జీలను 40శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. 13 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో చార్జీలు పెరగడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త చార్జీల మేరకు ఈ నెల 10 నుంచి మెనూ అమలు చేయడానికి అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. చార్జీలు పెంచడంతో బుధవారం రెంజల్‌లోని బాలుర వసతి గృహంతో పాటు మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చిత్రపటాన్ని పట్టుకుని హర్షం వ్యక్తం చేశారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి చార్జీల పెంపు గురించి వివరించారు.

జిల్లాలో 13 వేల మందికి లబ్ధి

ప్రభుత్వం ఇటీవల డైట్, కాస్మెటిక్ చార్జీలతో జిల్లాలో హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న సుమారు 13,125 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 10 వసతి గృహాల్లో 1,428 మంది విద్యార్థులు, 19 మైనారిటీ గురుకుల పాఠశాల్లో 6,686 మంది చదువుకుంటున్నారు. బీసీ వెల్ఫేర్ పరిధిలో 19 ప్రి మెట్రిక్, 15 పోస్టు మెట్రిక్ వసతి గృహాలు ఉండగా 3,268 మంది విద్యార్థులు ఉన్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ పరిధిలో 42 హాస్టళ్లలో 3000 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరికి లబ్ధి చేకూరనుంది.

పెంచిన డైట్ చార్జీల వివరాలు నెలకు.. (రూ.లో)

తరగతి	పాతచార్జీ	పెరిగిన చార్జీ
3-7	950	1,330
8-10	1,100	1,540
ఇంటర్ నుంచి..	1,500	2,100
కాస్మెటిక్ చార్జీలు		
3-7 బాలికలు	55	175
8-10బాలికలు	75	275
3-7 బాలురు	62	150
8-10బాలురు	60	200

నృసింహ క్షేత్రం.. ఉత్సవాలకు సిద్ధం

- లింబాద్రి గుట్టపై నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- తరలి రానున్న భక్తులు



గర్భ గుడిలోని నృసింహుడు



ఆలయ పుష్కరిణి



ఆలయానికి మెట్ల దారి

మోర్తాడ్: ఉత్తర తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన భీమ్‌గల్ శివారులోని శ్రీ నింబాచలం(లింబాద్రి గుట్ట)పై బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. గుట్టపై కొలువుదీరిన లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతీ ఏటా కార్తీక మాసంలో 11 రోజుల పాటు వైభవంగా సాగుతాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలి వస్తారు. ఉత్సవాల్లో ముఖ్య ఘట్టమైన రథోత్సవం(జాతర), కల్యాణం రోజున లక్షలాది మంది జనంతో నింబాచలం కిటకిటలాడుతుంది. గురువారం సాయంత్రం గ్రామాలయం నుంచి స్వామి వారి ఉత్సవ మూర్తులు కొండపైకి మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నంబి లింబాద్రి తెలిపారు.

ప్రకృతి ఒడిలో..

నింబాచల క్షేత్రం భీమ్‌గల్ మండల కేంద్రానికి ఐదు కిలో మీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. ఈ కొండ రెండు అంతస్తుల సమాహారం. ప్రథమార్థంలో సువిశాల స్థలంలో పుష్కరిణి, కల్యాణ మండపం, రథం ఉంచే గుడి ఉన్నాయి. ఈ స్థలాన్ని స్వామి వారి మాడ వీధులుగా పిలుస్తారు. కొండకు ఎగువన ఉన్న ద్వితీయార్థంలో రాతి గుహలో స్వామి వారు కొలువుదీరి ఉన్నారు.



స్థల ప్రాశాస్త్యం

నింబాచలం అంటే వేప చెట్లతో నిండిన కొండలని అర్థం. బ్రహ్మ వైవర్త పురాణంలో ఈ క్షేత్ర ప్రస్తావన ఉంది. పూర్వం చతుర్ముఖుడైన బ్రహ్మ సరస్వతి సమేతుడై నింబాచల క్షేత్రంలో తపమాచరించారని పురాణాల ద్వారా తెలుస్తుంది. పరమ శివుడు జోడు లింగాల రూపంలో వెలిశాడని స్థల పురాణం చెబుతోంది. ఈ క్షేత్రాన్ని బద్రీనాథ్ అని కూడా పేర్కొంటారు. కొండపై రాతి గుహలో మహాలక్ష్మి, కృష్ణుడు, అర్జునుడు, హనుమాన్ సమేతంగా స్వామివారు కొలువుదీరి ఉన్నారు. లక్ష్మీ దేవిని స్వామివారి తొడపై కూర్చొబెట్టుకుని ఉంటారు. పక్కన కృష్ణార్జునుల విగ్రహాలు ఉన్నాయి. దేశంలో బద్రినాథ్‌లో మాత్రమే ఇలా కృష్ణార్జునుల సమేతంగా లక్ష్మీ నరసింహుల విగ్రహాలు ఉన్నాయి.

ప్రశాంత వదనంతో స్వామివారు

ఇక్కడ కొలువైన నరసింహస్వామి ఉగ్ర రూపంతో కాకుండా ప్రశాంత వదనంతో ఉంటారు. ఇది దేశంలోని అన్ని అవతారాలకు భిన్నం. బ్రహ్మోత్సవాల్లో నిత్య పూజలందుకునే శ్రీ లక్ష్మీ నృసింహుల ఉత్సవ విగ్రహాలు భీమ్‌గల్‌లోని లక్ష్మీనరసింహస్వామి గ్రామాలయంలో ఏడాది పొడుగున నిత్య పూజలు అందుకుంటాయి.

ఉత్సవాల వివరాలు

- గురువారం (7వ తేదీన) ఉత్సవ ఆరంభము సందర్భంగా సారె సమర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం గ్రామాలయం నుంచి కొండపైకి ఉత్సవ మూర్తులు తీసుకెళ్తారు.
- 8వ తేదీన దీపారాధన, రక్షాబంధనం, మత్స్యంగ్రహణం, అంకురార్పణం, గరుడ పటాదివాసం, ధ్వజారోహణం.
- 9న శ్రవణ ప్రయుక్త క్షీరాభిషేకం, నృసింహ ఏకాక్షరిహవనం.
- 10న మధ్యాహ్నం శ్రీవారి కల్యాణ ఎదుర్కోలు.
- 11న మధ్యాహ్నం 12:30 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం.
- 12న సర్వేషం ఏకాదశి, చాతుర్మాస్య వ్రత సమాప్తి, నృసింహ ఏకాక్షరిహవనం, గీతాహవనం, గరుడ సేవ.
- 13న ఉత్థాన ద్వాదశి, తులసి వివాహం, కొండ ప్రదక్షిణం.
- 14న వైకుంఠ చతుర్దశి, సీతానగరంపై డోలారోహణం.
- 15న రథోత్సవం, జాతర.
- 16న ఉదయతుర్వార్వం, శేషహోమం, శ్రీవారికి స్వపన తిరుమంజనం, చక్ర తీర్థం భాగవత ఫలవతి, పూర్ణాహుతి, పుష్పయాగం.
- 17న దేవతోద్వాసనం, ధ్వజారోహణం, ఉద్వాసన బలి ప్రదానం, కొండబలి, పుష్కరిణిపై డోలోత్సవం, శ్రీవారి అశ్వవాహణంపై ఊరేగింపుతో రాగా సప్తవర్ణ పూజతో ఉత్సవం సమాప్తం అవుతుంది.

క్లుప్తంగా

సీఎంను కలిసిన డీసీసీబీ చైర్మన్‌



సుభాష్‌నగర్‌: హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేశ్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అకాలవర్షాల బాధితులకు అండగా ఉండేందుకు సీఎం సహాయనిధికి సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో అన్ని జిల్లాల సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షులతో కలిసి రూ.1,51,01,116 చెక్కును అందజేశారు. అనంతరం రుణమాఫీ, రైతు భరోసా, బోనస్‌, ఇతర అంశాలపై చర్చించామని, వాటి మంజూరుపై సీఎం సానుకూలంగా ఉన్నారని రమేశ్‌రెడ్డి తెలిపారు.

11 నుంచి ఎంఈడీ బ్యాక్‌లాగ్‌ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంఈడీ మొదటి సెమిస్టర్‌ బ్యాక్‌ లాగ్‌ పరీక్షలు ఈనెల 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల టైం టేబుల్‌, పూర్తి వివరాలకు తెలంగాణ వర్సిటీ వెబ్‌సైట్‌ www. telanganauniversity.ac.inని సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ టీమ్‌ కెప్టెన్‌గా అర్జున్‌



అర్జున్‌

గాంధారి(ఎల్లారెడ్డి): పాఠశాల స్థాయి 68వ ఎస్‌జీఎఫ్‌ కబడ్డీ ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా జట్టు కెప్టెన్‌గా పేట్‌సంగెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థి బుక్యా అర్జున్‌ ఎంపికైనట్లు పీఈటీ లక్ష్మణ్‌ తెలిపారు. గత నెల 29న కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అర్జున్‌ ఉత్తమ ప్రతిభకనబర్చాడన్నారు. ఈ నెల ఏడు నుంచి తొమ్మిది వరకు యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో జరిగే అండర్‌–14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా జట్టుకు అర్జున్‌ను కెప్టెన్‌గా నియమించినట్లు పీఈటీ తెలిపారు. అర్జున్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్‌కు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్‌ జాతీయ స్థాయి స్విమ్మింగ్‌ పోటీలకు జిల్లాకు చెందిన జునైరహా అమూల్‌ ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయికి ఎంపికైన జునైరహా.. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీ ల్లో పాల్గొనున్నారు. జునైరహాను బుధవారం నగరంలోని అభ్యాస స్కూల్‌ కరస్పాండెంట్‌ చెన్నా అన్నపూర్ణ, ఇన్‌చార్జి మాధవి, పీఈటీ ఆకుల నాగరాజు, తదితరులు అభినందించారు.

రైతుల ధాన్యం రోడ్డు పాలు

- డొక్కు లారీల్లో బస్తాల తరలింపు
- రోడ్డు వెంబడిపడిపోతున్నా పట్టించుకోని వైనం



కంఠేశ్వర్‌ బైపాస్‌ రోడ్డులో లారీలో నుంచి కిందపడిపోయిన ధాన్యం బస్తాలు

నిజామాబాద్‌ రూరల్‌: రైతులు ఎంతో శ్రమించి పండించిన ధాన్యం రైస్‌ మిల్లులకు చేరే క్రమంలో రోడ్ల పాలవుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు తరలించే క్రమంలో నిర్లక్ష్యం కారణంగా రోడ్లపై బస్తాలు పడిపోతున్నాయి. కంఠేశ్వర్‌ బైపాస్‌ గుండా వెళ్లే లారీల్లో నుంచి ధాన్యం బస్తాలు కిందపడిపోయినా వాహనదారులు డ్రైవర్లకు సమాచారం ఇస్తేకానీ అప్రమత్తం కాని పరిస్థితి ఉంది. నిజామాబాద్‌ రూరల్‌ పరిధిలోని సహకార పరపతి సంఘాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై వారం కూడా గడవక ముందే రైస్‌ మిల్లులకు తరలించడంలో లారీల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంలో కూడా బైపాస్‌రోడ్డుతోపాటు ధర్మారం (బి) వద్ద ఎన్నోసార్లు ధాన్యం బస్తాలు కింద పడి పోయిన ఘటనలు ఉన్నాయి. కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం బోనస్‌ ప్రకటించిన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి చేరింది. కానీ సహకార అధికారుల నిర్లక్ష్య వైఖరితోపాటు ట్రాన్స్‌పోర్ట్‌ అధికారులు కొనుగోలు కేంద్రాలకు అలాట్‌ చేసిన లారీలు పాతవి కాడంతో రైతులు పండించిన ధాన్యం రోడ్ల పాలవుతోంది. ధాన్యం తూకం వేసిన అనంతరం తాళ్లతో వడ్ల లోడ్‌ను హమాలీలు కడతారు. అయితే డ్రైవర్లు లారీలను ఇష్టారీతి నడపడంతో బస్తాలు రోడ్లపై పడిపోతున్నాయి. ప్రమాదాలూ తప్పుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్య ధోరణి

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వాహనాలను కేటాయించే ముందు ట్రాన్స్‌పోర్ట్‌ అధికారులు లారీల కండీషన్‌ను పట్టించుకోవడం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లారీల్లో పట్టే ధాన్యం ఎంత? అసలు తీసుకు వెళ్తున్న దాన్యం ఎంత అనే విషయాని నిశితంగా పరిశీలించాలని రైతులు అంటున్నారు. సహకార సంఘాల అధికారులు సైతం లారీల కండీషన్‌ను పరిశీలించడంతోపాటు ధాన్యం తరలింపును పర్యవేక్షించాలంటున్నారు.

పర్యవేక్షణ ఉండాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, డ్రైవర్ల నిర్లక్ష్యంగా కారణంగా ధాన్యం బస్తాలు రోడ్డు పాలవుతున్నాయి. అలాట్‌మెంట్‌ అయిన రైస్‌మిల్లులకు రైతుల ధాన్యం సక్రమంగా చేరడం లేదు. దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరం.

– నర్సయ్య, రైతు, బర్ధిపూర్‌

దేశ సమగ్రతకు కృషి చేయాలి



వలంటీర్లను అభినందిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): హర్యానా రాష్ట్రంలోని మీరాటా ర్యుడులో నిర్వహించిన జాతీయ సమగ్రత శిబిరాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లను తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్‌ ఛాన్సలర్‌ టి యాదగిరిరావు అభినందించారు. 16 రాష్ట్రాల నుంచి 200 మంది వాలంటీర్లు పాల్గొన్న కార్యక్రమంలో తెలంగాణ వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు నాలుగు పతకాలు సాధించడం గొప్ప విషయమని వీసీ అన్నారు. సంగీతం, పాటలు, నృత్యాలు, డ్రామా వంటి కార్యక్రమాలు ప్రజల ఆలోచన విధానాన్ని మారుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా వలంటీర్లు ప్రదర్శించిన బోనాలు, బతుకమ్మ పండుగలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్త ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. అనిల్‌, శ్రావణ్‌, శ్రీహర్షిని, రాజేశ్వరి, హిరమణి పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన జిల్లా క్రికెట్‌ జట్టు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన అండర్‌–23 క్రికెట్‌ టోర్నీలో బుధవారం నాటి మ్యాచ్‌లో జిల్లా జట్టు ఓడినప్పటికీ మెరుగైన రన్‌రేట్‌తో సెమీస్‌కు చేరింది. బుధవారం నాటి మ్యాచ్‌లో నల్గొండ జట్టుతో నిజామాబాద్‌ జట్టు తలపడింది. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ చేసిన నల్గొండ జట్టు 160 పరుగులకు ఆలౌట్‌కాగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్‌ జిల్లా జట్టు 148 పరుగులకు కుప్పకూలింది. అయితే నెట్‌రన్‌ రేట్‌ ఆధారంగా జిల్లా జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఆదిలాబాద్‌తో సెమీ ఫైనల్‌లో తలపడనుంది.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సరస్వతి ఎంపీహెచ్‌డబ్ల్యూ(మహిళల) ఏఎన్‌ఎం ట్రెనింగ్‌ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్‌ పి మహేశ్‌ కుమార్‌ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రైవేట్‌ శిక్షణ సంస్థలలో రెండు సంవత్సరాల ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్‌) కోర్సుల్లో భాగంగా మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏదైన గ్రూపులో ఇంటర్మీడియెట్‌ పూర్తిచేసినవారు ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90598 88512 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్కూల్‌ విద్యార్థుల ఆటో బోల్తా



చేయి విరిగిన విద్యార్థి

బాల్కొండ: మండలంలోని నచికేత ఆవాస కేంద్రం విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో పాత జాతీయ రహదారి 44పై అదుపుతప్పి బోల్తాపడింది. ముప్కాల్‌ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 13 మంది ఆటోలో పాఠశాలకు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ విద్యార్థికి చేయి విరగగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. చేయి విరిగిన విద్యార్థిని మెరుగైన చికిత్స కోసం ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానికంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండగా ముప్కాల్‌ మండల కేంద్రానికి తరలించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గంగారాం తెలిపారు.

ఆటో చోరీ.. ఒకరిపై కేసు

నిజామాబాద్‌ రూరల్‌: రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మాధవనగర్‌ గ్రామానికి చెందిన షేక్‌హుస్సేన్‌కు చెందిన ఆటోను ఇంటిముందు నుంచి సోమవారం రాత్రి దుండుగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ తెలిపారు. చోరీకి గురైన ఆటో బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో లభించిందని, చోరీకి పాల్పడిన దుండగుడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం సుంకిని శివారు నుంచి అనుమతిలేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత పట్టుకున్నట్లు తహసీల్దార్‌ మల్లయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకుని కోటగిరి పోలీస్‌స్టేషన్‌ తరలించామన్నారు. ట్రాక్టర్లు సుంకిని గ్రామానికి చెందిన రంజిత్‌పటేల్‌, శివలింగారావుకు చెందినవిగా గుర్తించామన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తహసీల్దార్‌ స్పష్టం చేశారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్‌ గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 4 కింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు బుధవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంట్లో తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన తిప్పిరిశెట్టి బాలాజీపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డీటీ కిష్టయ్య తెలిపారు.

పోక్సో కేసు నమోదు

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన రౌడీషీటర్‌ అశోక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక తమ పొలం వద్ద మేకలు మేపుతుండగా, అశోక్‌ అసభ్యకరంగా సైగలు చేశాడు. బాలిక ఏడ్చుకుంటూ వెళ్లి వాళ్ల అమ్మతో జరిగిన విషయం చెప్పిడంతో అశోక్‌పై పోలీస్‌స్టేషన్‌ లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

వడ్డీ వ్యాపారి వేధింపులు తాళలేక ఆత్మహత్య



సయ్యద్‌ హబీబ్‌ అజార్‌ మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని అశోక్‌ సాగర్‌లో దూకి ఆటో నగర్‌కు చెందిన సయ్యద్‌ హబీబ్‌ అజార్‌ (32) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన అజార్‌ బుధవారం అశోక్‌సాగర్‌లో శవమై తేలాడు. నగరంలోని పూలాంగ్‌కు చెందిన ఒకరి వద్ద అజార్‌ అప్పు తీసుకున్నాడు. అధిక వడ్డీ కోసం ఆయనను వేధించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. అజార్‌ ఆత్మహత్యలో ఓ పోలీసు అధికారి ప్రమేయం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై ఆరో టౌన్‌ ఎస్సై వెంకట్‌రావును 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా, ఆయన స్పందించలేదు.

తనను ఏం చేస్తారోననే భయంతో వృద్ధుడు..



పాల చిన్నయ్య (ఫైల్‌)

మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లికి చెందిన పాల చిన్నయ్య (63) గ్రామశివారులోగల అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో చుక్క యాదగిరిగౌడ్‌ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేపలు పట్టడంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే చిన్నయ్య మంగళవారం రాత్రి కులాస్‌పూర్‌ చెరువులో దొంగతనంగా చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్కడే కాపలా ఉన్న మత్స్యకారులు ఆయనను గుర్తించి పట్టుకునేందుకు వెంబడించగా తప్పించుకుని ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం కులాస్‌పూర్‌ మత్స్య సొసైటీ సభ్యులు పాల చిన్నయ్య ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులు, కులస్తులకు వివరించారు. సొసైటీ సభ్యులు తన ఇంటికి రావడంతో చిన్నయ్య భయాందోళనకు గురయ్యాడు. తనను ఏం చేస్తారోనని మనస్తాపానికి గురై వారు వెళ్లిన తర్వాత అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మద్యానికి బానిసై మరొకరు..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లికి ఒకరు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రంజిత్‌ తెలిపారు. గ్రామానికి చెందిన రుస్తుం రామారావు(58) మద్యానికి బానిసై భార్య, కుమారుడితో గొడవపడేవాడు. తరచూ గొడవ జరుగుతుండడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రామారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన పలువురి అదృశ్యం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగవ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఆర్యనగర్‌కు చెందిన కోటా విఠల్‌రెడ్డి(64) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. మానసిక వైకల్యం ఉన్న విఠల్‌రెడ్డి గతనెల 31న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆయన భార్య అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కోటగల్లీకి చెందిన మహిళ

కోటగల్లికి చెందిన జిల్లా రాజమణి (75) అదృశ్యమైనట్లు నాలుగో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు. అక్టోబర్‌ 23న ఇంటి నుంచి వెళ్లిన రాజమణి తిరిగి ఇంటికి రాలేకపోవడంతో ఆమె కొడుకు మహేశ్‌ ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డికి చెందిన వృద్ధుడు

ఎల్లారెడ్డిరూరల్‌: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వృద్ధుడు షేక్‌ హైదర్‌ హుస్సేన్‌ (60) అనే వృద్ధుడు ఈనెల 2వ తేదీ నుంచి కనబడడంలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేశ్‌ బుధవారం తెలిపారు. బహిర్భూమికని ఈనెల 2న ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఖాదర్‌ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. వారి ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవీపేటకు చెందిన వ్యక్తి..

నవీపేట: మండల కేంద్రంలోని దర్యాపూర్‌ కాలనీకి చెందిన డాంగె లక్ష్మణ్‌ అదృశ్యమైనట్లు ఎస్సై వినయ్‌ బుధవారం తెలిపారు. 25 ఏళ్ల కిందట మాక్లూర్‌ మండలంలోని మానిక్‌బండార్‌కు చెందిన నవనీతతో డాంగె లక్ష్మణ్‌కు వివాహం కాగా, 15ఏళ్ల కిందట గొడవ జరగడంతో నవనీత తన పిల్లలతో కలిసి మానిక్‌బండార్‌లో ఉంటోందన్నారు. గత ఆగస్టు నుంచి తన భర్త డాంగె లక్ష్మణ్‌ కనబడడం లేదని ఆయన భార్య నవనీత ఫిర్యాదు చేసిందన్నారు. భర్త అదృశ్యమైంపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిల్లలతో కలిసి వివాహిత..

బోధన్‌రూరల్‌: సాలూర మండల కేంద్రానికి చెందిన వివాహిత తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 5వ తేదీన తెల్లవారుజామున వివాహిత ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్‌ నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న డీసీపీ కోటేశ్వరరావు, సీనియర్‌ సిటిజన్స్‌

ఖలీల్‌వాడి: సైబర్‌ నేరాల నివారణకు పోలీసుశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, మోసాల బారిన పడిన వారు వెంటనే ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని అదనపు పోలీసు కమిషనర్‌(అడ్మిన్‌) పి కోటేశ్వరరావు అన్నారు. 1930 ద్వారా సైతం సైబర్‌ క్రైం రిపోర్టు చేయొచ్చని తెలిపారు. తెలంగాణ సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌ (హైదరాబాద్‌)ఆదేశాల నేపథ్యంలో ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ సూచనల మేరకు సీపీ కార్యాలయ కాన్ఫరెన్స్‌ హాలులో 'సైబర్‌ జాగృత దివస్‌' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీనియర్‌ సిటిజన్లను చైతన్యం చేసేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీపీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగం పెరిగిన ప్రస్తుత తరుణంలో సైబర్‌నేరాల సంఖ్య సైతం అదేస్థాయిలో పెరిగిందన్నారు. సైబర్‌నేరాలకు చెక్‌ పెట్టడంతోపాటు సీనియర్‌ సిటిజన్లకు సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. సీనియర్‌ సిటిజన్‌లు డిజిటల్‌ అరెస్టు స్కామ్స్‌, ఇన్వెస్ట్‌మెంట్‌ (స్టాక్‌) ఫ్రాడ్స్‌, ఇంపర్సనేషన్‌ (వేషధారణ), ఫ్రాడ్స్‌ తదితర మోసాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమిషనరేట్‌ పరిధిలోని నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ డివిజన్‌ల పరిధిలోని అన్ని పోలీస్‌ స్టేషన్‌లలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్‌ క్రైం పోలీసులు పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అవగాహన కల్పించారు. సైబర్‌ క్రైం ఏసీపీలు వైవీ రావు, రాజావెంకట్‌రెడ్డి, స్పెషల్‌ బ్రాంచ్‌ సీఐ శ్రీశైలం, నిజామాబాద్‌ సీనియర్‌ సిటిజన్‌ ఫోరం సభ్యులు, సైబర్‌ క్రైం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన టీఎన్జీవోస్‌ జిల్లా అధ్యక్షుడు



నిజామాబాద్‌అర్బన్‌: టీఎన్జీవోఎస్‌ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సుమన్‌ బుధవారం జిల్లా కేంద్రంలోని అసోసియేషన్‌ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే అసోసియేట్‌ అధ్యక్షుడిగా పెద్దోళ్ల నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుమన్‌ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్‌, టీఎన్జీవోఎస్‌ అసోసియేట్‌ అధ్యక్షుడు పెద్దోళ్ల నాగరాజు పాల్గొన్నారు.

గల్ఫ్‌ ఏజెంట్‌ మోసం.. గుండెపోటుతో మృతి



ఏజెంట్‌ ఇంటి ఎదుట రాజేశ్‌లాల్‌ మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆర్మూర్‌టౌన్‌: గల్ఫ్‌ ఏజెంట్‌ చేసిన మోసాన్ని తట్టుకోలేక రాజేశ్‌ లాల్‌ అనే వ్యక్తి బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో నివాసముంటున్న రాజేశ్‌లాల్‌ తన కుమారుడు సృజన్‌ను యూరప్‌ దేశానికి పంపించేందుకు పట్టణానికి చెందిన ఏజెంట్‌ ప్రసాద్‌కు రూ.5 లక్షలు ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న ఏజెంట్‌ యూరప్‌కు కాకుండా కజకిస్తాన్‌కు పంపిచడంతో సృజన్‌ ఇండియాకు తిరిగి వచ్చేశాడు. తనను మోసం చేశావని, డబ్బులు తిరిగి ఇవ్వాలని రాజేశ్‌ ఇటీవల ప్రసాద్‌ను కోరాడు. ప్రసాద్‌ డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేశ్‌లాల్‌ బుధవారం ఉదయం గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు రాజేశ్‌లాల్‌ మృతదేహంతో పెర్కిట్‌లోని ఏజెంట్‌ ప్రసాద్‌ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శాంతింపజేయడంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

చేపల పట్టేందుకు వెళ్లి..

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన వెళ్లిన ఒకరు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌ బుధవారం తెలిపారు. ఈనెల 4వ తేదీన సిద్ధరాములు అనే వ్యక్తి చేపలు పట్టేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. మంగళవారం గ్రామంలోని పెద్ద చెరువు వద్దకు వెళ్లగా అక్కడ ఉన్న దుర్గమ్మ దేవాలయం వద్ద సిద్ధరాములు చెప్పులు, సైకిల్‌, దుస్తులు కనిపించాయి. దీంతో గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం మధ్యాహ్నం చెరువు నీటిలో సిద్ధరాములు మృతదేహం తేలింది. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌ ఢీకొని సైకిలిస్టు..

భిక్కనూరు:మండలంలోని అంతంపల్లి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బైక్‌ ఢీకొని సైకిలిస్ట్‌ బుధవారం రాత్రి మృతి చెందాడు. గ్రామానికి చెందిన పుల్లూరి మల్లయ్య(58) సైకిల్‌పై తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా హైదరాబాద్‌ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న బైక్‌ ఢీకొట్టింది. కిందపడిపోయిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలోపడి..

బోధన్‌రూరల్‌ : బోధన్‌ మండలంలోని భూలక్ష్మీక్యాంపునకు చెందిన కోట వెంకటరాంరెడ్డి(33) ప్రమాదవశాత్తు డీ 40 కెనాల్‌లో పడి మృతి చెందినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు పెగడపల్లి గ్రామ శివారులోని కెనాల్‌ వైపు వెళ్లిన వెంకటరాంరెడ్డి ప్రమాదశాత్తు అందులోపడి మృతి చెందాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారి హత్య కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: అక్రమ సంబంధానికి అడ్డు వస్తోందని చిన్నారిని హత్య చేసిన వ్యక్తితోపాటు అతడికి సహకరించిన చిన్నారి తల్లికి న్యాయస్థానం జీవితఖైదు విధిస్తూ బుధవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లాలోని బోధన్‌ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన సేవేళ్ల సంజీవ్‌ మోర్తాడ్‌ వద్ద పని చేసే సమయంలో నిర్మల్‌ జిల్లా రాంనగర్‌కు చెందిన చెంచు రజిత అలియాస్‌ రాధతో పరిచయం ఏర్పడింది. సంజీవ్‌తో పరిచయమయ్యే నాటికి రజితకు మూడేళ్ల చిన్నారి అమ్ములు ఉంది. సంజీవ్‌, రజితల మధ్య అక్రమ సంబంధం ఏర్పడింది. సంజీవ్‌ మోర్తాడ్‌లో పని చేసిన తర్వాత తన స్వగ్రామమైన కల్దుర్కికి వెళ్లారు. తమ అక్రమ సంబంధానికి చిన్నారి అడ్డుగా ఉందని బాలికను ఇద్దరు కలిసి చిత్రహింసలకు గురి చేశారు. 2023 ఏప్రిల్‌ 11వ తేదీన రాత్రి వేళలో చిన్నారి కాలుపై కర్రతో కొట్టాడు. కాలు విరిగి చిన్నారి ఏడవడంతో ఇద్దరూ కలిసి ముక్కు, నోరు మూశారు. స్పృహ కోల్పోయిన చిన్నారిని సంజీవ్‌ కల్దుర్కి గ్రామంలోని రామన్‌ చెరువుకు తీసుకెళ్లి నీటిలో తలకిందులుగా ముంచి చంపేశాడు. బోధన్‌ రూరల్‌ పోలీసులు సంజీవ్‌, రజితపై కేసులు నమోదు చేసి రిమాండ్‌ కు తరలించారు. కేసులో ఎస్సీ, ఎస్టీ స్పెషల్‌ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌ బుధవారం ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించారు. అంతేకాకుండా ఈ కేసులో సాక్ష్యాధారాలను ధ్వంసం చేసేందుకు యత్నించిన ఇద్దరికి మూడు సంవత్సరాల పాటు కఠిన కారాగార శిక్ష విధించారు. ఎస్సీ, ఎస్టీ కేసులో సంజీవ్‌కు అదనంగా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.